# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 22-05-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఉపాధి హామీ పనుల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్. జవహర్ రెడ్డి ఆదేశించారు.**
2. **రాష్ట్రంలో ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలను ఈ నెల 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఇంటర్మీడియట్ విద్యా మండలి వెల్లడించింది.**
3. **ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యేవరకు బాణసంచా విక్రయాలపై నిషేధం విధించినట్లు ఏలూరు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వై.ప్రసన్న వెంకటేష్ తెలిపారు.**
4. **హజ్-2024 యాత్ర ఈనెల 27వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని ఆంధ్రప్రదేశ్ హజ్ కమిటీ కార్యనిర్వహణ అధికారి ఎల్.అబ్దుల్ ఖాదిర్ పేర్కొన్నారు.**
5. **భారతీయ పునరుజ్జీవనోద్యమ పితామహునిగా పేరుగాంచిన ప్రముఖ సంఘ సంస్కర్త రాజా రామ్మోహన్ రాయ్ జయంతి ఈ రోజు.**

==========================

కేంద్ర ఎన్నికల సంఘం అనుమతించిన నేపథ్యంలో ఉపాధి హామీ పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్. జవహర్ రెడ్డి ఆదేశించారు. తాగునీరు, ఉపాధి హామీ పనులు, విద్యుత్ సరఫరా పరిస్థితులపై నిన్న వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం నుంచి ఆయన జిల్లా కలెక్టర్లతో దృశ్యమాధ్యమ విధానంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉపాధి హామీ, స్వచ్ఛ భారత మిషన్ అనుసంధానంతో విస్తృతంగా వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని, సూచించారు. ఉపాధి హామీ పథకం పనుల నిర్వహణకు అనువైన కాలం కావడంతో పనులు చేపట్టాలని, నీటి పొదుపు పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.

-------------------------

ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలను ఈ నెల 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యదర్శి సౌరభ్ గౌర్ ఓ ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాల నుంచి సాయంత్రం 5 గంటల 30 నిమిషాల వరకు పరీక్షలు నిర్వహిస్తామని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 861 పరీక్ష కేంద్రాల్లో 5 లక్షల 3 వేల 459 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారని మొదటి సంవత్సరం జనరల్‌లో 3 లక్షల 46 వేల 393 మంది, ఒకేషనల్ 19 వేల 479

మంది, రెండో సంవత్సరం జనరల్‌లో లక్షా 21 వేల 545 మంది, ఒకేషనల్ 16 వేల 42 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామని వివరాల కోసం 08645-277702, 18004251531 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

---------------------------

అనంతపురం జిల్లావ్యాప్తంగా ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈరోజు అనంతపురం కలెక్టర్ కార్యాలయంలో సప్లిమెంటరీ పరీక్షల నిర్వాహణపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లాలో 34 కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. మొదటి, రెండవ సంవత్సరం కలిపి మొత్తం 22 వేల 510 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు బందోబస్తు నిర్వహించాలని, గ్రామీణ ప్రాంతాల నుంచి పరీక్ష కేంద్రాలకు వచ్చేందుకు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాల్లో నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యేవరకు జిల్లాలో బాణసంచా విక్రయాలపై నిషేధం విధించినట్లు ఏలూరు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వై.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. నిన్న కౌంటింగ్ ప్రక్రియపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జూన్ 4న కౌంటింగ్ జరగనున్నందున ఆరోజు ఎక్కడా బాణసంచా కాల్చకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నామన్నారు. కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని, ఆయా ప్రాంతాల్లో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎన్నికల ఫలితాలను దృష్టిలో పెట్టుకొని బాణసంచా వేడుకలపై నిషేధం విధించామని తెలిపారు. బాణసంచా విక్రయాలు, కాల్పులకు సంబంధించి ఎటువంటి అనుమతులు జారీ చేయరాదని రెవెన్యూ, అగ్నిమాపక శాఖల అధికారులకు స్పష్టం చేశారు.

---------------------------

ఈనెల 27వ తేదీ నుంచి హజ్-2024 యాత్ర ప్రారంభమవుతుందని ఆంధ్రప్రదేశ్ హజ్ కమిటీ కార్యనిర్వహణ అధికారి ఎల్.అబ్దుల్ ఖాదిర్ ఓ ప్రకటనలో వెల్లడించారు. విజయవాడ హజ్ యాత్ర శిబిరం నుంచి హజ్ కు వెళ్లే వారికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. ఈనెల 27, 28, 29 తేదీల్లో మూడు విమానాలు హజ్ యాత్రీకులను తీసుకుని వెళ్తాయని పేర్కొన్నారు. ఇందుకోసం గన్నవరం విమానాశ్రయం సమీపంలోని కేసరపల్లిలోని ఈద్గా జామ మసీదు వద్ద హజ్ వసతి క్యాంపు కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. యాత్రకు సంబంధించి మరింత సమాచారం కోసం 18004257873 ట్రోల్ ఫ్రీ నంబర్ లో సంప్రదించాలని అబ్దుల్ ఖాదీర్ సూచించారు.

---------------------------

ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులందరికీ పాఠ్య పుస్తకాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా విద్యాశాఖాధికారి తాహెరా సుల్తానా అన్నారు. విజయవాడలోని జిల్లా ప్రభుత్వ పాఠ్య పుస్తకాల విక్రయ కార్యాలయం నుంచి మండలాలకు ఆర్టీసీ బస్సుల ద్వారా పుస్తకాలు తరలించే బస్సును నిన్న ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా తాహెరా సుల్తానా

మాట్లాడుతూ, కృష్ణాజిల్లాకు సంబంధించి ఒకటి నుంచి పదో తరగతి వరకు మొత్తం 8 లక్షల 32 వేల 626 పుస్తకాలు, ఎన్టీఆర్ జిల్లాకు ఒకటి నుంచి నుంచి పదో తరగతి వరకు మొత్తం 6 లక్షల 61 వేల 861 పుస్తకాలు సరఫరా చేయాల్సి ఉందని వెల్లడించారు.

---------------------------

పర్యావరణ పరిరక్షణకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవవైవిధ్య బోర్డు-ఏపీఎస్‌బిబి ఏటా ఇచ్చే జీవ వైవిధ్య పరిరక్షణ పురస్కారం 2024కు రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం ఎంపికైందని కారాగారం సూపరింటెండెంట్ ఎస్. రాహుల్ అధికారిక ప్రకటనలో తెలిపారు. కారాగారంలో నిర్వహిస్తున్న పర్యావరణ అనుకూల పద్ధతులు, భూగర్భ జలాల సంరక్షణ, సహజ వ్యవసాయ పద్ధతులు, సహజ వనరులతో వివిధ చేతిపనుల ఉత్పత్తికి గానూ జీవవైవిధ్య పరిరక్షణ పురస్కారాన్ని ఏపీఎస్‌బిబి ప్రకటించిందని రాహుల్ పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోలేదని యథావిధిగా కొనసాగుతున్నాయని ఆరోగ్యశ్రీ ముఖ్య కార్యనిర్వహణాధికారి డాక్టర్ లక్ష్మీ షా తెలిపారు. ఆరోగ్యశ్రీ అందుబాటులో ఉండే ఆసుపత్రులకు 203 కోట్ల రూపాయల బిల్లు చెల్లింపులు చేపట్టినట్లు పేర్కొన్నారు. మిగతా బిల్లుల చెల్లింపులు వీలైనంత త్వరగా చేపడతామని, ఆసుపత్రుల యాజమాన్యాలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పథకం కింద పేద, మధ్య తరగతి ప్రజలకు ఉచిత వైద్యసేవలు అందించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్....18 సెకన్లు....

---------------------------

భారతీయ పునరుజ్జీవనోద్యమ పితామహునిగా పేరుగాంచి.. అనేక మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా పోరాటం జరిపిన ప్రముఖ సంఘ సంస్కర్త రాజా రామ్మోహన్ రాయ్ జయంతి ఈ రోజు. 1772 మే 22వ తేదీన బెంగాల్ ప్రెసిడెన్సీలో జన్మించిన ఆయన... సతీ సహగమనాన్ని అరికట్టడానికి అవిరళ కృషి చేశారు. సామాజిక మత సంస్కరణ ఉద్యమమైన "బ్రహ్మ సమాజ్"ను 1828 సంవత్సరంలో నెలకొల్పారు. ఆంగ్ల విద్యా విధానానికి మద్దతు పలికారు. దాదాపు రెండున్నర శతాబ్దాలు గడిచిపోయినప్పటికీ... ఆ మహనీయుని సందేశాలు నేటికి ఆదర్శ ప్రాయంగా ఉంటున్నాయి. ఆచరణయోగ్యంగా నిలుస్తున్నాయి

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించిన కౌన్సెలింగ్‌ను రేపటి నుంచి నిర్వహించనున్నట్లు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నాగరాణి తెలిపారు. ఈనెల 27 నుంచి జూన్ 3 వరకు ధ్రువపత్రాల పరిశీలన చేపడతామని పేర్కొన్నారు. కోర్సులు, కళాశాలల ఎంపికకు మే 31 నుంచి జూన్ 5 వరకు వెబ్ ఐచ్ఛికాల నమోదు చేసుకోవచ్చని తెలిపారు. జూన్ 5న ఐచ్ఛికాలను మార్చుకోవచ్చని చెప్పారు. జూన్ 7న సీట్లను కేటాయించి, 10 నుంచి 14 వరకు ప్రవేశాలను ఖరారు చేస్తామని వివరించారు. విద్యార్థులు సీటు పొందిన కళాశాలల్లో వ్యక్తిగతంగా లేదా ఆన్‌లైన్ విధానం ద్వారా రిపోర్టు చేయాలని, జూన్ 10 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

======================